క్లుప్తంగా

నేడు విద్యుత్ బంద్

ఖానాపూర్: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధి ఖానాపూర్, సుర్జాపూర్, కడెం, లింగాపూర్, బెల్లాల్ ఫీడర్లలో నెలవారీ మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. అంతరాయానికి బదులుగా రాత్రికి అదనంగా మూడు గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇస్తామని.. రైతులు గమనించాలని కోరారు.

పాఠశాలకు టీవీ అందజేత



టీవీ అందిస్తున్న నారాయణ

కుంటాల: మండలంలోని ఓలా పంచాయతీ పరిధి రాజాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొత్తకాపు నారాయణ రూ.15వేల విలువైన టీవీని శుక్రవారం తాను పనిచేస్తున్న పాఠశాలకు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎం నిధుల మళ్లింపు?

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) గ్రామపంచాయతీకి చెందిన స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) 2024 కింద మంజూరైన రూ.54 వేలు దారి మళ్లినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై మండలకేంద్రానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త ఎండీ.జాబీర్ ఇటీవల ఎంపీడీవో పుష్పలతకు వినతి పత్రం అందించి విచారణ జరిపించాలని కోరారు. గతంలో పనిచేసిన పంచాయితీ అధికారులే ఈ నిధులు కాజేశారనే ఆరోపణలున్నాయి. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

ఖానాపూర్: హెచ్‌ఐవీ, సిఫిలిస్ వ్యాధి సోకిన గర్భిణులు కంగారు పడొద్దని ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న క్లస్టర్ కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యాధి సోకినప్పటికీ గర్భిణులు ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వవచ్చని పేర్కొన్నారు. వైద్యుల సలహాతో మందులు వాడాలని కోరారు. పూర్తి వివరాలకు 1097 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బాసర: మండలంలో సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పవన్‌చంద్రకు భారతీయ సంఘం నా యకులు, పలువురు రైతులు వినతిపత్రం అందించారు. శుక్రవారం బాసర తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి రైతుల సమస్యలు విన్నవించారు.

ఖగోళశాస్త్ర ప్రయోగశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ

ఖానాపూర్: అంతరిక్షం, నక్షత్రాలపై పరిశోధనలు చేసే ఖగోళశాస్త్ర ప్రయోగశాలపై శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాలకు చెందిన బయోసైన్స్, సోషల్ స్టడీస్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఢిల్లీ నుంచి వచ్చిన ఆస్ట్రో ల్యాబ్ శిక్షకులు మస్తాన్ అహ్మద్, మిశ్రా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ల్యాబ్‌లను కలెక్టర్ ప్రత్యేక నిధులతో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే



వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ రానాశ్రీ

నిర్మల్‌టౌన్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని ఏఎంవీఐ రానాశ్రీ అన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలో వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వాహనాల ఫిట్‌నెస్, బీమా, లైసెన్సులను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు. ఏఎంవీఐ రజనీకాంత్, సిబ్బంది తదితరులున్నారు.

మృత్యుపిలుపుగా మలుపులు



బాసర రైల్వేస్టేషన్ వద్ద..

బాసర: మండలకేంద్రంలో పలు ములుపులు మృత్యువుకు పిలుపులుగా మారుతున్నాయి. బాసర గోదావరి వంతెన నుంచి బైంసా, నిజామాబాద్ మీదుగా జాతీయ రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బాసరలో బస్టాండ్, రైల్వేస్టేషన్, శివాజీచౌక్, ఆర్జీయూకేటీ కళాశాల, సరస్వతి అమ్మవారి ఆలయం, గోదావరి నది పుష్కరఘాట్, గోదావరి వంతెన వరకు వెళ్లే మార్గంలో రోడ్డుపై మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఎదురెదురుగా ఢీకొంటున్నారు. ఇక్కడి ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడి ఆసుపత్రుల్లో చేరారు. అధికారులు చొరవ తీసుకొని మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బాసర గోదావరి వంతెన వద్ద కానరాని సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు

ఈ రోడ్లకు మరమ్మతు చేపట్టలే..

సూర్యాపూర్ శివాలయం వద్ద కొట్టుకుపోయిన రోడ్డు



అందకూర్ సమీపంలో రోడ్డు పక్కన కోతకు గురై ఏర్పడిన గుంతలు



కుంటాల: భారీవర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లు దెబ్బతినగా అధికారులు ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. కల్లూరు-కుంటాల మార్గంలో అందకూర్ అలుగు సమీపంలో సుమారు పది మీటర్ల వరకు రోడ్డు కోత గురవగా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయం, కొత్త వెంకూర్ నుంచి పాత వెంకూర్ వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురవగా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా అధికారుల స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆసుపత్రిలోకి వచ్చేదెలా?

చిన్నపాటి వర్షం కురిసినా మండలకేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణ బురదమయంగా మారుతోంది. దీంతో ఆస్పత్రిలోకి వెళ్లి వైద్యం చేయించుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఆసుపత్రిలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- లోకేశ్వరం



తానూరులో దోచేస్తున్నారు..

- మండలకేంద్రంలో వరుస దొంగతనాలు
- భయాందోళనలో ప్రజలు
- రాత్రి వేళల్లో స్థానికుల గస్తీ

తానూరు: సరిహద్దు ప్రాంతమైన తానూరు మండలకేంద్రంలో వరుస దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గడిచిన నెల రోజుల్లోనే మూడు దుకాణాల్లో వరుస దొంగతనాలు జరగగా తాజాగా బుధవారం రాత్రి రెండు బైక్‌లను ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. వరుస దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి భయంభయంగా కాలం వెల్లదీస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేపట్టి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జరిగిన ఘటనలు..

- గత నెల 7న తానూరులో రాత్రి దినేష్ కిరాణ దుకాణంలో చొరబడి రూ.30 వేల నగదు తోపాటు రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.



వైన్స్‌లో వివరాలు సేకరిస్తున్న ఎస్సై షేక్ జుబేర్

- గత నెల 21న రాత్రి వైన్స్‌లో దొంగలు వెనుక భాగంలోని రేకులు తొలగించి లోనికి ప్రవేశించారు. సుమారు రూ.లక్ష విలువైన మద్యం తోపాటు, రూ.11 వేలు, వైన్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజీని ఎత్తుకెళ్లారు.
- గత నెల 27న పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఓ దుకాణంలో వెనుక భాగంలో రేకులను తొలగించి లోనికి చొరబడ్డారు. రూ. 10 వేలను ఎత్తుకెళ్లారు.
- మూడు నెలల కిందట తానూరుకే చెందిన వెంకటేశ్ అనే యువకుడి బైక్‌ను ఎత్తుకెళ్లారు.
- తాజాగా బుధవారం(ఈనెల8న) అర్ధరాత్రి గ్రామానికి చెందిన ఇద్దరు యువకుల రెండు బైక్‌లను అపహరించారు. వాటిని తీసుకెళ్తుండగా పోలీసుల వాహనాన్ని చూసి గ్రామ సమీపంలో బైక్‌లను వదిలేసి పరారయ్యారు.



తానూరులో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

రాత్రి గస్తీ నిర్వహిస్తున్నాం

నెల రోజుల నుంచి ఎక్కడో చోట దొంగతనం జరుగుతుండడంతో రాత్రి వేళ పోలీసుల గస్తీ పెంచాం. బుధవారం రాత్రి పోలీసుల వాహనాన్ని చూసిన దుండగులు బైక్‌లను వదిలేసి పోయారు. దొంగల కోసం గాలిస్తున్నాం. త్వరలో దొంగలను పట్టుకుంటాం. మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాల్లో పోలీసుల గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రజలు భయపడొద్దు.

– షేక్ జుబేర్, తానూరు ఎస్సై

'న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ నిరసనలు'

నిర్మల్‌టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గందమల్ల నాగభూషణ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 13న కలెక్టరేట్ వద్ద, 17న మండలకేంద్రాల్లో, 22న హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ, ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అన్ని మండలాల నుంచి నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు నందకుమార్, ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి మురళీకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్, నాయకులు శనిగారపు రవి, రాజు, శంకర్, లక్ష్మణ్, అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సార్‌మేడిల ఎన్నిక

పెంబి: మండలంలోని చింతగూడ గ్రామంలో శుక్రవారం రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావు ఆధ్వర్యంలో రాయిసెంటర్ సార్‌మేడి (ఏడు గ్రామాలకు పటేల్)గా చిన్ను పటేల్, ఉప సార్‌మేడిగా సీడం తుకారాంను స్థానిక పటేళ్లతో కలిసి ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సార్‌మేడిలు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాడుతామన్నారు. అనంతరం ఎన్నికైన సార్‌మేడిలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాజ్‌గోండ్ సేవా సమితి పెంబి మండలాధ్యక్షుడు గెడెం అశోక్, మామడ మండలాధ్యక్షుడు సిడం ప్రవీణ్ కుమార్, పలు గ్రామాల పటేళ్ల పోల్లు పటేల్, జైతు పటేల్, దొందేరావు, మాణిక్‌రావు, కిషన్, సోమేశ్వర్, మారు తదితరులు ఉన్నారు.



సార్‌మేడిలను సన్మానిస్తున్న గ్రామ పటేళ్లు

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నర్సాపూర్(జి): పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సీడీపీఓ నాగలక్ష్మి అన్నారు. పోషణమాసంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ మానస, సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: గర్భిణులు పోషకాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన కుమారి, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సునీల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్: మాట్లాడుతున్న సీడీపీవో నాగలక్ష్మి

'రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ హైడ్రామా'

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం.9 పేరిట హైడ్రామా చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల నిలుపుదలను నిరసిస్తూ పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాజేశ్వర్‌గౌడ్, గౌరీకార్ రాజు, పుప్పాల గజేందర్, నల్ల శ్రీనివాస్, బాపురావు, బీసీ రాజన్న, తోట సుమిత్, రఫీక్, పార్శపు శ్రీనివాస్, ప్రదీప్, సుమన్, రాకేశ్, శేఖర్, వాల్‌సింగ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

బాసర: మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా డాక్టర్ కిరణ్ కొమ్రేవర్, విలాస్ గడేవర్, డాక్టర్ రమాదేవి, లోలం శ్యాంసుందర్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిన హామీల బాకీ కార్డులను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు కోర్వా శ్యామ్, గంగారావు, నర్సింగరావు, ధర్మారావు, సంజీవ్ రావు, మారుతి పటేల్, మాధవ్ పటేల్, లక్ష్మారెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, పాల్గొన్నారు. ఈసందర్భంగా బాసర గ్రామానికి చెందిన 15 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి సీనియర్ నాయకులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఖానాపూర్ : నిరసనలో బీఆర్ఎస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

సన్మానం

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసే పంకజ్ పాల్ ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో ఏటీవోగా ఎంపికయ్యాడు. శుక్రవారం కళాశాల ఆవరణలో అతడిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతమ్, అధ్యాపకుడు శ్రీనివాస్, వినోద్, చిన్నయ్య, మహేందర్, వెంకటేశ్వర్ ఉన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

కుభీర్: మండలంలోని జామ్‌గాం గ్రామంలో గురువారం రాత్రి ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఖండ కుటుంబ ప్రబోదక్ బాలాజీ, ఖండ కార్యావాహ పోశెట్టి, ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ శ్రీనివాస్, వినయ్ తదితరులు ఉన్నారు.

ఈ కేవైసీ ప్రక్రియ పరిశీలన

తానూరు: మండలకేంద్రంలో చేపట్టిన ఉపాధిహామీ కూలీల ఈకేవైసీ ప్రక్రియను శుక్రవారం ఈజీఎస్ ఏపీవో శివలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి సమాచారం ఇచ్చి ఈకేవైసీ పూర్తి చేయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట టీఏ రమణగౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దాడి హేయనీయం'

భైంసాటౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని బుద్ధ, అంబేద్కర్ ఐడియాలజీ సొసైటీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని మొగల్‌పురకు చెందిన అబ్దుల్ హఫీజ్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పరామర్శించారు. అంతకుముందు మండలంలోని గోసంపల్లి కి చెందిన ఫొటోగ్రాఫర్ పటేరి లక్ష్మణ్ కుమారుడు అహన్ నిర్మల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తోట సుమిత్, వాహబ్, షోయబ్, తదితరులు ఉన్నారు.

గురుకులం విద్యార్థుల ప్రతిభ

సారంగపూర్: నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–17 బాక్సింగ్ పోటీలు నిర్వహించగా సారంగపూర్ మండలంలోని జామ్ గురుకుల విద్యార్థులు ప్రతిభ చా టారు. శుక్రవారం గురుకులంలో బంగారు పతకం సాధించిన బి.కవిత, వెండి పతకం సాధించిన సుహాసినిని సత్కరించారు. వీరు రాష్ట్రస్థాయి పో టీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు.

జీవనశైలి మార్పుతోనే మానసిక ఆరోగ్యం

నిర్మల్‌ఖిల్లా: జీవనశైలి మార్పుతోనే మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి సురేష్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని 12 ఏళ్లలోపున్న చిన్నారులకు వైద్యసేవలు అందించారు. పిలలకు చిత్రలేఖనం, రంగులనద్దే పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భావోద్వేగాల నియంత్రణ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఖానాపూర్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో గ్లోబల్ బెస్ట్ టీచర్ రోల్ మోడల్ అవార్డు అందుకున్న మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్‌ను శుక్రవారం సన్మానించారు. మస్కాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నయ్య, మహేందర్, గజేందర్, మహిపాల్, చిన్ను, మధు, ఇమ్రాన్, శివ తదితరులు ఉన్నారు.

'రిజర్వేషన్ల అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి'

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్, మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో సబ్‌కలెక్టర్ సంకేత్‌కుమార్‌ను త న కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవసరమైతే పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు కాంగ్రెస్ పార్టీ అఖిలపక్ష నాయకులను తీసుకెళ్లి రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, పోశెట్టి, మల్లేశ్, దత్తు, నర్సయ్య, పండరి, గంగాధర్, నాగేశ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ'

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా అన్యాయం చేస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో చట్టం చేయకుండా జీవోనం.9 ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూడటం బీసీలను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఈ అప్రజాస్వామిక చర్యలపై హైకోర్టు స్టే ఇచ్చినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశంపై చట్టబద్ధత కల్పించి పారదర్శక ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు శ్రీనివాస్, వినోద్‌కుమార్, అబ్దుల్ సాదిక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆప్ అధ్యక్షుడు సయ్యద్ హైదర్

వంతెన వద్ద రక్షణేది.?



లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామం వద్ద ప్రధానరోడ్డు కనకాపూర్ వాగుపై లోలెవల్ వంతెన ప్రమాదకరంగా మారింది. చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో రాకపోకలు సాగించే వాహనదారులు వాగులోకి దూసుకెళ్లే ముప్పు ఉంది. అధికారులు వంతెన వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని తిర్పెల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

బాసర ఐజేయూ కార్యవర్గం

బాసర: మండలకేంద్రంలోని ఆర్యవైశ్య సత్రంలో శుక్రవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) బాసర మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎండల సంతోష్‌రావు, అధ్యక్షుడిగా నర్సూరి భీంరావు, ఉపాధ్యక్షుడిగా అంతగిరి మాధవ్, ప్రధాన కార్యదర్శిగా అబ్బువార్ గౌతమ్, కోశాధికారిగా బండారి ఆనంద్, సలహాదారులుగా హనుమంతరావు, నర్సూరి ధర్మారావు, సభ్యులుగా బలగం రాములు, కోదటి సుధాకర్‌రావు, దావు సంతోష్, జాదవ్ సంజీవ్, జాదోళ్ల ప్రకాశ్, పసుపోల్ల నాగేష్, బల్గం పవన్‌కుమార్, పింప్లే రామేశ్వర్ ఎన్నికయ్యారు. టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక భూమయ్య, హన్మాండ్లు, యోగేష్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

రోడ్డు మరమ్మతుకు రూ.50వేల సాయం

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ నుంచి కొత్తమద్దిపడగ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే బురదగా మారుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే కొత్తమద్దిపడగ, రాంపూర్, మైసంపేట్, పాతమద్దిపడగ, లక్ష్మీసాగర్ తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన లశెట్టి శేఖర్, జడ కృష్ణయ్య సుమారు రూ.యాభై వేలు ఖర్చు చేసి గుంతల్లో మొరం నింపి చదును చేయించారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.



బాగు చేయించిన రోడ్డు వద్ద గ్రామస్తులు